క్లుప్తంగా

బిల్లులు లేకుండానే విత్‌డ్రా?

అశ్వాపురం: మండల పరిషత్ కార్యాలయం ఖాతా నుంచి నెల రోజుల క్రితం విత్ డ్రా చేసిన సుమారు రూ.70వేలకు సంబంధించి బిల్లులు, ఓచర్లు లేనట్టు సమాచారం. జూలై నెలలో నూతన ఎంపీడీఓగా రవీంద్రప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఎలాంటి పనులు చేయకుండా, బిల్లులు, ఓచర్లు లేకుండా ఆగస్టు 1వ తారీఖున మండల పరిషత్ ఖాతా నుంచి డబ్బులు డ్రా చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విషయం బయటకు రావడంతో వాటికి సంబంధించి బిల్లులు సృష్టించాలని చూస్తున్నట్టు సమాచారం. జిల్లా పరిషత్ ఉన్నతాధికారులు స్పందించి ఈ వ్యవహారంపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

నర్సాపురంలో హెల్త్‌క్యాంప్


మహిళలను పరీక్షిస్తున్న డాక్టర్లు

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారి శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్పెషలిస్ట్ హెల్త్ క్యాంప్‌ను మంగళవారం నిర్వహించారు. గైనకాలజిస్ట్, కంటి వ్యాధులు, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులు పేషెంట్లను పరిశీలించారు. ఈ క్యాంపులో 60 మంది వరకు మహిళలకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. స్పెషలిస్ట్ హెల్త్‌క్యాంపును అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సైదులు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చైతన్య పరిశీలించారు. ఈ క్యాంపులో డాక్టర్ సుభాష్, నర్సాపురం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

ములకలపల్లి: వెల్ఫేర్ బోర్డు స్కీములను ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పే కుటిల యత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పని ప్రదేశాల్లో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీఓ నంబర్ 12ను సవరించి, భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. ఉడత రమణయ్య, కమల, గోపాల్, లక్ష్మీ నారాయణ, మిడియం శ్రీను పాల్గొన్నారు.

జీఓ 22ను రద్దు చేయాలి


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

అశ్వారావుపేట: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిని ప్రైవేటు కంపెనీలకు దారాదత్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ 22ను రద్దు చేయాలని సీఐటీయూ ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికుల అడ్డా వద్ద ప్లకార్డులతో నిరసన నిర్వహించారు. కార్మికులకు కార్మిక శాఖ నుంచి రావాల్సిన క్లైమ్‌లు ఇప్పటికే రావడం లేదని, జీవో 22 ద్వారా కార్మికులకు తీవ్ర అన్యాయం జరగకుండా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు భీమా చెన్నారావు, తిరుమలశెట్టి వెంకన్నబాబు, కణితి సరసారావు, శ్రీను, గురునాథం, లక్ష్మీనారాయణ, శివ ఉన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

భద్రాచలంటౌన్: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై సేవాలాల్ సంఘం అధ్యక్షుడు భూక్యా సంజీవ నాయక్ చేసిన అనుచిత వ్యాఖ్యలను జాతీయ ఆదివాసీ గిరిజన సంఘాల జేఏసీ అధ్యక్షుడు చందా లింగయ్య దొర ఖండించారు. పట్టణంలోని గిరిజన ఆదివాసీ అభ్యుదయ భవన్‌లో మంగళవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆదివాసీ గిరిజన ఎమ్మెల్యేలపై కొందరు లంబాడా సంఘాలను నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, అటువంటి చర్యలను సహించబోమని హెచ్చరించారు. సమావేశంలో నరసింహారావు, రామకృష్ణ, శ్రీను, సారయ్య, వెంకటరమణ, నాగేశ్వరరావు, గోపాల్, మంగమ్మ, విజయలక్ష్మి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దీక్షకు సంఘీభావం

అశ్వారావుపేట: రామన్నగూడెం భూముల వివాదాన్ని పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద 2వ రోజు దీక్షలో ఉన్న గిరిజనులకు మాజీ ప్రజాప్రతినిధులు మంగళవారం సంఘీభావం తెలిపారు. అశ్వారావుపేట మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జేతి సాంబశివరావు, ఆసుపాక మాజీ సర్పంచ్ పొట్టా రాజులు దీక్షలో ఉన్న గిరిజనులను కలిసి సంఘీభావం తెలిపారు.

పత్తి రైతుకు వానగండం

- ఏకధాటిగా కురుస్తున్న వర్షాలు
- ఎదుగుదల నిలిచిన పత్తి పైరు
- ఆలస్యమవుతున్న పూత, కాత
- ఆందోళన చెందుతున్న రైతులు


చింతగుప్పలో అధిక వర్షాల కారణంగా ఎదుగుదల నిలిచిన పత్తి చేను

చర్ల: ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలతో సాగులో ఉన్న పత్తి పంటలు ఎదుగుదల నిలిచిపోయాయి. జూలై రెండో వారం నుంచి ప్రారంభమైన వర్షాలు ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కూడా భారీగా కురవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. మొలిచిన పత్తిపంట అతికష్టంగా ఎదుగుతోంది. ఈ క్రమంలో పంట ఎదుగుదల కోసం ఎరువులు, గడ్డి చావడం కోసం పలుమార్లు గడ్డి మందును పిచికారీ చేసినప్పటికీ ఆశించిన ఫలితాలు రాకపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

40 వేల ఎకరాల్లో సాగు

భద్రాచలం వ్యవసాయ సబ్ డివిజన్‌లోని భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో సుమారు 40 వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నారు. చర్లలో 4,850 ఎకరాలు, దుమ్ముగూడెంలో 22,375 ఎకరాలు, భద్రాచలంలో 5 ఎకరాల్లో పత్తి పంటలు సాగవుతున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నప్పటికీ.. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో మరో 12,500 ఎకరారాల్లో పోడు భూముల్లో అనధికారికంగా పత్తిపంటలు సాగవుతున్నాయి.

మొత్తంగా వ్యవసాయ సబ్ డివిజన్‌లో సుమారు 40 వేల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేయగా.. ఈ మొత్తం విస్తీర్ణంలో సగానికి పైగా పంట అధిక వర్షాలతో పూత నిలిచి, కాత ఆలస్యం అవుతోంది.

నెల రోజుల్లో పూత, కాత వచ్చేనా?

అధికంగా కురుస్తున్న వర్షాల వల్ల పత్తి పంట చేతికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఏటా ఈ ప్రాంతంలో రైతులు జూన్, జూలై నెలల్లో పత్తి విత్తనాలు నాటి పంట ఎదిగిన తరువాత అక్టోబర్, నవంబర్ చివరి నుంచి పత్తి తీయడం ఆరంభిస్తారు. అటు తరువాత సాగునీటి సౌకర్యం లేని చేలల్లో సరిగ్గా రెండు నెలల పాటు మాత్రమే రెండు లేదా మూడు సార్లు పత్తి తీస్తారు. నీటి సౌకర్యం ఉన్న చేలకు మాత్రం నీరు పెట్టి ఎరువులు వేసి మరొక సారి పత్తి తీస్తారు. అయితే ఈ సారి అధిక వర్షాల కారణంగా పరిస్థితులు భిన్నంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పత్తి పంట సాగు చేసిన సుమారు 40 వేల ఎకరాలకు సంబంధించి మూడోవంతు సాగుకు నీటి వసతి లేదు. కేవలం వర్షాధారం పైనే రైతులు సాగు చేశారు. వర్షాలు ఇంతటితో ఆగి మళ్లీ డిశంబర్, జనవరిలో ఏమైనా కురిస్తే పత్తి రైతుకు కొంత ఊరట లభిస్తుంది.

ఎర్రబారుతోంది..



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పత్తి చేలల్లో నీరు నిలిచి పంట ఎదుగుదల నిలిచింది. పల్లపు భూములు, చౌడు భూముల్లో మొలిచిన పత్తి మొక్కలు ఎర్రబారుతున్నాయి. ఇక నుంచి వర్షాలు పూర్తిగా తగ్గితేనే పత్తిపంటకు కాలం కలిసొచ్చినట్లవుతుంది. లేకుంటే పత్తిపంట పూత, కాత కష్టమే.

– తాటి నవీన్, రైతు, చర్ల

మూడెకరాల్లో సాగు చేశా..



ఈ ఏడాది మూడెకరాల్లో పత్తి పంట సాగు చేశాం. విత్తనాలు నాటిన మొదట్లో కాలం మంచిగానే సహకరించింది. కాలం కలిసొస్తుందిలే అనుకుంటున్న సందర్భంలో వర్షాలు అధికమయ్యాయి. దీంతో చేలల్లో నీరు నిలిచి పంట ఎదుగుదల నిలిచింది. పంట ఎర్రబారుతోంది. దీంతో ఈ సారి పత్తి పంట కష్టంగానే మారనుంది.

– మడకం రాజయ్య, రైతు, బూరుగుపాడు

‘ఏకపక్షంగా లాభాల వాటా ప్రకటన’


మణుగూరురూరల్: నల్లబ్యాడ్జీలతో నిరసన..

మణుగూరుటౌన్: సింగరేణి లాభాల్లో కార్మికులకు వాటా ప్రకటనపై చర్చలు జరపకుండా ఏకపక్షంగా ప్రకటించడాన్ని ఏరియా ఏఐటీయూసీ నాయకులు ఖండించారు. మంగళవారం బ్రాంచ్ కార్యదర్శి రాంగోపాల్ యూనియన్ కార్యాలయంలో మాట్లాడుతూ.. గతేడాది కన్నా 1శాతం ఎక్కువ చెల్లిస్తున్నామంటూ నికర లాభాలను తక్కువగా చూపించారని, కార్మికులను అంకెల గారడీతో మోసం చేశారని విమర్శించారు. సమావేశంలో రామనర్సయ్య, ఆవుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్యాయం చేసిన ప్రభుత్వం..

లాభాల వాటా ప్రకటనలో కాంట్రాక్ట్ కార్మికులకు ప్రభుత్వం సింగరేణి యాజమాన్యం తీరని అన్యాయం చేసిందని నిరసిస్తూ మంగళవారం అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఇఫ్టూ ఆధ్వర్యంలో కేసీహెచ్‌పీ డీజీఎం మదన్‌నాయక్, ఓసీ–2 మెనేజర్ సురేశ్, ఇతర అధికారులకు కాంట్రాక్ట్ కార్మికులు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌డి.నాజర్‌పాషా, జిల్లా నాయకులు మిడిదొడ్ల నాగేశ్వరరావు, ఏరియా నాయకులు అంగోత్ మంగీలాల్, సాధనపల్లి రవి, పెనుగొండ నాగార్జున పాల్గొన్నారు.

మణుగూరురూరల్: సింగరేణి సంస్థ సాధించిన లాభాల్లో నుంచి కార్మికులకు సరైన వాటా ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం మోసం చేశాయని టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో మణుగూరు ఏరియాలోని వివిధ గనులు, డిపార్ట్‌మెంట్లలోని కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం నాగెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడారు. నాయకులు బంగారి పవన్‌కుమార్, మునిగెల నాగేశ్వరరావు, సుద్దాల సంపత్‌కుమార్, మస్తాన్, రామాచారి, మురళీకృష్ణ, జె.రాజ్‌కుమార్, ముకేష్‌కుమార్, ప్రసాద్, వినయ్‌కుమార్, ఇమ్రాన్, శ్రీనవాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ కూలీలకు పనిముట్లు అందజేత

కరకగూడెం: మండలంలోని భట్టుపల్లి రైతువేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఉపాధి హామీ కూలీలకు సుమారు రూ.5లక్షల విలువైన పనిముట్లను అందజేశారు. పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రతాప్, ఎంపీఓ మారుతి, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ వినీత, ఏపీఓ బక్కయ్య, టీపీసీసీ సభ్యుడు చందా సంతోష్, పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, మాజీ సర్పంచ్‌లు పోలేబోయిన తిరుపతయ్య, తోలెం నాగేశ్వరరావు, నాయకులు ఎర్ర సురేష్,జలగం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పనిముట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

ఆర్థిక సాయం అందజేత



కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

బూర్గంపాడు: మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ బిజ్జం కృష్ణారెడ్డి నాలుగేళ్ల క్రితం ప్రమాదంలో మృతిచెందాడు. అతని పిల్లల చదువుల కోసం మండల ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిఏటా రూ.10వేల ఆర్థికసాయమందిస్తున్నారు. మంగళవారం కృష్ణారెడ్డి కుటుంబసభ్యులకు అసోసియేషన్ ప్రతినిధులు ఈ ఏడాది పిల్లల చదువులకు రూ.10వేల సాయం అందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ, కార్యదర్శి ఆవుల వెంకటరమణారెడ్డి, కోశాధికారి మేడి శేషగిరి, జిల్లా కన్వీనర్ పంపన రమేష్, నుసుం కోటిరెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, నాగరాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీ దేవి అలంకరణలో అమ్మవారు

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు వేదమాత గాయత్రీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించగా, ఆలయ అర్చకులు మంత్రోచ్చారణల మధ్య అర్చనలు జరిపారు. అమ్మవారి దివ్యరూపాన్ని భక్తులు దర్శించుకుని, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

– సాక్షి నెట్‌వర్క్


భద్రాచలం, మణుగూరులో గాయత్రీ దేవి అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు


దమ్మపేట: లింగాలపల్లిలోని నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా


మణుగూరురూరల్: అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

విద్యుత్ బల్బులు వితరణ

దమ్మపేట: మండలంలోని మొద్దులగూడెం గ్రామంలో వీధి బల్బులు లేని వీధిలో ఎల్‌ఈడీ విద్యుత్ బల్బులను, స్థానిక యువజన కాంగ్రెస్ నాయకులు బొంతు రాజశేఖర్, కర్లపూడి బాలు మంగళవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా వీరిని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మోరంపూడి వెంకటేశ్వరరావు, గ్రామస్తులు అభినందించారు.

ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

భద్రాచలంటౌన్: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మహిళా రాష్ట్ర అధ్యక్షురాడు కుంజ రమాదేవి మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అక్రమంగా ఎస్టీ జాబితాలోకి వచ్చిన లంబాడాలతో అసలైన ఆదివాసీలకు తీరని అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. పట్టణంలోని మార్కెట్ యాడ్ గ్రౌండ్‌లో ఈనెల 28వ తేదీన ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించే ఈ మహాధర్మయుద్ధం భారీ బహిరంగ సభను ఆదివాసీలు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

రహదారుల మరమ్మతుకు 29న పాదయాత్ర

దుమ్ముగూడెం: భద్రాచలం నియోజకవర్గంలోని రహదారులను మరమ్మతు చేయాలని కోరుతూ.. సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 29న పాదయాత్ర చేపట్టనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం జరిగిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ములకపాడు సెంటర్ నుంచి భద్రాచలం సబ్ కలెక్టర్ ఆఫీస్ వరకు కొనసాగే ఈ మహా పాదయాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీ, మర్మం చంద్రయ్య, కొరస చిలకమ్మా, యలమంచి శ్రీనుబాబు, బొల్లి సత్యనారాయణ, సరియం కోటేశ్వరరావు, కొడాలి లోకేష్ బాబు, కొమరం చంటి, మర్మం సమ్మక్క, సోయం వీర్రాజు, కూరం వీరభద్రం, కొమరం వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ చట్టాలను అమలు చేయాలి

దుమ్ముగూడెం: ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం మండల మహాసభ కల్లూరి వీరభద్రం నగర్ లో కంగాల రాంబాబు, కారం బాయమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ.. 1/70 చట్టం, పెసా చట్టం, ఇతర ఆదివాసీ హక్కులు చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు అధ్యక్షుడిగా కంగాల రాంబాబు, కార్యదర్శిగా సరియం కోటేశ్వరరావుతో సహా 15 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గౌరీ నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు పడకం సతీష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మర్మం చంద్రయ్య, తిరుపతిరావు, హరిబాబు, కారం బాయమ్మ సోంది శ్రీను సున్నం వెంకటేశ్వర్లు పర్శిక లక్ష్మయ్య ఇరమయ్య, కొమరం వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

శుద్ధి యంత్రంపై చిత్తశుద్ధి లేదు!

అశ్వారావుపేటరూరల్: కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులను శుద్ధి చేసేందుకు వినియోగించిన యంత్రాలపై చిత్తశుద్ధి లేకుండా పోయింది. అశ్వారావుపేట మండలంలోని జమ్మిగూడెంలోగల ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు తీసుకొచ్చే ధాన్యంలో తాలు, చెత్త, రాళ్లను శుభ్రం చేసేందుకు దమ్మపేట మార్కెట్ కమిటీ నుంచి శుద్ధి చేసే యంత్రాన్ని తీసుకొచ్చి వినియోగించారు. ఆ తర్వాత ధాన్యం కొనుగోళ్లు ముగిసిన తర్వాత ఆయా యంత్రాలను తిరిగి గోదాంలో భద్రపరచాల్సి ఉంది. కానీ నెలలు గడుస్తున్న బాధ్యులైన అధికారుల నిర్లక్ష్యం కారణంగా యంత్రాలు కొనుగోలు కేంద్రం వద్దే ఉండిపోగా పిచ్చి మొక్కలు కమ్మేసి, యంత్రాలు తుప్పు పట్టుతున్నాయి. దీనిపై స్థానిక సొసైటీ ఇన్‌చార్జ్ సీఈఓ హేమగిరిను ‘సాక్షి’వివరణ కోరగా.. యంత్రాలను భద్రపరిచేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.


పిచ్చి మొక్కల్లో తుప్పపట్టి ఉన్న ధాన్యం శుద్ధి చేసే యంత్రం

పోలీసుల ముమ్మర తనిఖీలు

కరకగూడెం: మావోయిస్టు వారోత్సవాల దృష్ట్యా పోలీసులు అప్రమత్తమయ్యారు.ఈ మేరకు మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు.ఎస్ఐ పీవీఎన్ రావు ఆధ్వర్యంలో పోలీసులు రహదారులపై వాహనాలను ఆపి తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పినపాక: మావోయిస్టు పార్టీ వారోత్సవాల దృశ్య ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. ప్రతి ఒక్క వాహనాన్ని, ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి పంపిస్తున్నారు. అసాంఘిక వ్యక్తులకు దూరంగా ఉండాలని, వాహనదారులు అలాంటివారికి లిఫ్ట్ ఇవ్వద్దని సూచించారు. అసాంఘిక వ్యక్తులు తారాస పడితే వెంటనే పోలీసులకి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: మావోయిస్టు పార్టీ వారోత్సవాల నేపథ్యంలో మంగళవారం రాత్రి భద్రాచలం టౌన్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణంలో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని లాడ్జీలు, ఆర్టీసీ బస్టాండ్, ప్రధాన వీధులు, ఇతర సమీప ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. అనుమానాస్పద కార్యకలాపాలను ముందస్తుగానే గుర్తించడం తనిఖీల ప్రధాన ఉద్దేశ్యమని ఈ సందర్భంగా పోలీసులు తెలిపారు.


భద్రాచలంఅర్బన్: బస్టాండ్‌లో యువకుడి వివరాలు తెలుసుకుంటున్న సీఐ, సిబ్బంది

పోషణ మాసోత్సవం


పోషణమాసం అవగాహన కార్యక్రమంలో సీడీపీఓ జయలక్ష్మి, తదితరులు

పినపాక: రాష్ట్రీ పోషణ మాసం వేడుకలను మంగళవారం పినపాక మండలం భూపాలపట్నం గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ జయలక్ష్మి అంగన్‌వాడీలతో కలిసి పోషణ మాసం ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పోషకాహార భద్రత, ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మ, పోషణ అభియాన్స్ నాగేశ్వరరావు, స్థానిక అంగన్‌వాడీల టీచర్లు, గర్భిణులు, పిల్లలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

భద్రాచలంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన నేపథ్యంలో కాంగ్రెస్ మైనార్టీ సెల్ పట్టణ శాఖ ఆధ్వర్యాన మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. భద్రాచలంలోని అటవీశాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షుడు అలీమ్, ఎస్‌కె.ఉస్మాన్, ఎస్‌కె.అలీమ్, ఎస్‌కె.ఖాసీం పాషా, ఎస్‌కె.సైరుద్దీన్, ఎస్‌కె.మస్తాన్, సయ్యది యాకుబ్ పాషా, భార్గవ్, పవన్‌కుమార్, రమేష్, ఎండి.బాబాజీ తదితరులు పాల్గొన్నారు.


పాలాభిషేకం చేస్తున్న నాయకులు


మువ్వా, ఎమ్మెల్యే పరామర్శ


ప్రమాదంలో గాయపడ్డ దిలీప్‌ను పరామర్శిస్తున్న విజయబాబు, ఎమ్మెల్యే ఆదినారాయణ

ములకలపల్లి: మండలపరిధిలోని చాపరాలపల్లి గ్రామానికి చెందిన పలువురు కుటుంబాలను టీఎస్ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలసి మంగళవారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ తన్నీరు దిలీప్‌ను స్వగృహంలో కలసి, ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అనారోగ్యంతో మృతి చెందిన మాచినేని చిట్టెమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. చిట్టెమ్మ కుమారుడు భాస్కర్ రావు కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మువ్వా మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపించనున్న నేపథ్యంలో ఐకమత్యంగా పనిచేయాలని సూచించారు. మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, నాగళ్ల వెంకటేశ్వరరావు, గాడి తిరుపతి రెడ్డి, పేటేటి నర్సింహారావు, మాచినేని మునేష్, నల్లమోతు జగదీష్, తన్నీరు నాగయ్య, మాచినేని మనీశ్వరరావు, చిరుమప్ప ఉన్నారు.

లక్ష్మీనగరం విద్యార్థులకు ఎంబీబీఎస్ సీట్లు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు నీట్ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఎంబీబీఎస్ సీట్లను సాధించారు. గ్రామానికి చెందిన మండా చరిష్మా నీట్ పరీక్షల్లో 3031 ర్యాంకు సాధించి హైదరాబాద్‌లోని అరుందతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ వైద్య కాలేజీలో సీటు సాధించింది. అలాగే గ్రామానికి చెందిన మోటుపల్లి చరణ్ నీట్ పరీక్షల్లో 2160 ర్యాంకు సాధించి మంచిర్యాల ప్రభుత్వ వైద్య కాలేజీలో సీట్ పొందాడు. ఇరువురికి కుటుంబసభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలియజేస్తున్నారు.


మండా చరిష్మా


మోటుపల్లి చరణ్

భిక్షాటన చేసి నిరసన

దుమ్ముగూడెం: తెలంగాణ ఆశ్రమ పాఠశాలల డైలీ వెజ్ వర్కర్ల రాష్ట్రవ్యాప్త సమ్మె మంగళవారం 12వ రోజుకు చేరింది. లక్ష్మీనగరం గ్రామంలో కార్మికులు బిక్షాటన చేసి ప్రభుత్వానికి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల నాయకుడు కొమరం చంటి మాట్లాడుతూ.. కలెక్టర్ గెజిట్ ప్రకారం రూ.26,800 జీతం చెల్లించాలని, జీతాలు తగ్గించే జీఓ నం.64ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమ్మక్క, బాపనమ్మ, సత్యనారాయణ, లక్ష్మి, భద్రమ్మ, తాటి పాపారావు, లక్ష్మయ్య, రాజు, రామక్క తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట: ఆశ్రమ పాఠశాలల దినసరి కార్మికుల నిరసనలో భాగంగా మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి దీక్షలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్మికులకు మద్దతుగా సీపీఎం నాయకులు చిరంజీవి, దొడ్డా లక్ష్మీనారాయణ, మోరంపూడి శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, అర్జున్ పాల్గొన్నారు.


దుమ్ముగూడెం: సూపర్ మార్కెట్ దగ్గర భిక్షాటన చేస్తున్న డైలీవేజ్ వర్కర్లు